# షికారు

షికారు వెళ్ళడమంటే ఇప్పటికీ సరదావే నాకు. అయితే పూర్వం వెళ్ళినంత దూరానికి గాని, దొడ్డదొడ్డ స్థలాలకు గాని ఇప్పుడు వెళ్ళడంలేదు.

మొన్నమొన్నను అనగా కనుంపండుగకు, ఒకానొక బుద్ధిపుట్టి కొవ్వూరు రైలుమీద వెళ్ళి అక్కడనుంచి తిరుగ వచ్చే టప్పుడు సాయంకాలం నాలుగుగంటలకు "లాంచీ" మీద వచ్చాను. లాంచీకి ఒక బస్తాల "బోటు" కూడా కట్టబడింది. ఆ బస్తాల బోటు మీద కూడా జనం ఎక్కారు. లాంచి కదపం బడింది.

నీలనీలంగా కనబడే గోదావరిమీద ఎదరుగా కొట్టే కెరటాలమ్మట నీళ్ళుపడి లాంచిలోకి బోటుమీదకూ తుషారంగా వచ్చి తడుపుతూవుంది. కొవ్వూరుకు రాజమండ్రి ఎదరఎదర వొడ్డుల మధ్య కాస్త దూరం! ఆ కాస్తదూరానికే ఎంతో ప్రకృతి దృశ్యం! ఉత్తరదిశ కొండలు కనిపిస్తూ వుంటాయి, దక్షిణాన్ని ఆనకట్టు కనిపిస్తూ వుంటుంది. మఱీ విడ్డూరంగా లంకలు వంతెన అగపిస్తూ వుంటాయి.

ఆనాడు ఎండకాయడం చేత వెచ్చవెచ్చగా ఆనందంగా వుంది. అయితే నాది షికారు అనిపించుకోలేదు. నాది ప్రయాణం అనిపించుకుంది. కొవ్వూరునుండి రాజమండ్రి తిరుగు ప్రయాణం అది అని అనిపించింది.

కాని వింతగా వెళ్ళి లంకలమీద దిగిన వాళ్ళు లేకపోలేదు. వాళ్ళను వాళ్ల "లాంచీ"లను వాళ్ల పండగ షికార్లను చూచి నప్పుడు అదో మోస్తరుగా బాల్యంలో పడి నా నావ షికార్లు,

నా సాయంకాలం విహాతులు అవీ జ్ఞాపకము వచ్చాయి. ఎన్ని సార్లు నావ షికార్లు వెళ్ళేమో ఎన్నిసార్లు ఉదయం పూట సాయం సంధ్య మేం అదే నడకగా నడిచివెళ్ళామో తట్టసాగింది.

15-1-1957 సాయంకాలము నా తిరుగు ప్రయాణంలో కూర్చుని చూచిన దృశ్యమునే గురించి, అంతక్రితం నా షికారుల్లో చూచిన అందాన్ని గురించి వ్రాయనా యని నాకే తోచే మీమాంస ఏదైనా ఇప్పటి చూపునుండి వెనక్కు వెనక్కు వెళ్లడమే మంచిదనిపిస్తూ వుంది ఆలోచించినకొద్దీ నేడు ఏమా అంటే నే మఱచిపోతానేమో ? మళ్లీ మఱచిపోతానేమో !

వంతెన ఎగువన ఒక పెద్ద లంకమీద వెయ్యిమంది వున్నట్లుగా జనం కనిపించారు. అనతిదూరంలో నాలుగులాంచీలు తెల్లజెండాలతో నిలబడివున్నాయి. వాళ్ళు వాటిల్లోంచి దిగారని ఊహించాం మేం. మా లాంచీ అప్పటి కప్పుడే కొవ్వూరు వైపున నడుస్తూ వంతెన క్రిందనుంచి వెళ్ళింది. వంతెనకు దూరదూర మౌతూ వుంది. వంతెన ఒక సన్ననిత్రాటిలా కనిపిస్తూ వుంది. కాని స్తంభాలు ఏర్పాటుగా లెక్కించడానికి వీలుగా వున్నాయి. వంతెన మీద ఒక గూడ్సుబండికూడా నడుస్తూవుంది. బళ్ళు ఇంజెను వెనకాల గార్డుబండి అన్నీ సన్నంగా చిన్నవయిపోయి ఏకంగా వున్నట్లున్నాయి. నడక మాత్రం తప్పలే. నీరు నీటుగా వుంది. కెరటాలను విసురుతూ వుంది. ఆవలి తీరాన్నీ రాజమహేంద్రవరపు చిహ్నాలు కనిపిస్తున్నాయి.

అప్పుడనుకొన్నాను " నావ షికార్లు మాని ఇప్పటి ప్రజలు తండోపతండాలుగా లాంచీ షికార్లు చేస్తూన్నారని. లంకమీద ఫలాహారం కంపెనీ అదీ బాగానే వుంటుంది. లంకలు కూడా

నూతనంగా ఏర్పడి కొద్దికొద్ది మొలకలతో ఇసుక తళతళతో వుంటాయి. అంటే కొత్తదనమే అనిపిస్తుంది.

లాంచీలమీద వేళ్లేకన్న అందరూ అన్ని నావలు చేసుకు తెడ్లు వేసుకు వెడితే మంచిదనిపించింది. కాని ఇప్పటి ప్రజలకు తెడ్లు వెయ్యడానికి తగ్గ వోపికేది ?

అయినా పాత సాంప్రదాయము వాళ్లు మఱచిపోలేదని సంతోషించాను సంక్రాంతి పండగ రోజుల్లో ఒకమాత్రైనా గోదావరిమీద షైరు వెళ్ళడం నాకు సరదా ! ఇక భూమిమీద ఆ రోజుల్లో చెప్పడానికి వీలేలేదు. కోడిపందాలా ! సారంగధరుని మెట్ట ఎక్కి దిగడమా ? పేకలాడుకొనడమా ? ఎన్ని ఎన్ని అన్నీ ఆటలే ! అన్నీ పాటలే ! నిజంగా షికార్లు అంటే ఆనాటి షికార్లే షికార్లు !

మఱి ఈ వ్యాసం పూర్తిచేసేముందు ఒక్కసారి దిఙ్మాత్రంగా మా వెనుకటి చర్య కూడా పూరిస్తాను. దాంతో ఈ వ్యాసం సంపూర్ణం.

మేము సర్వసాధారణంగా 1907, 1908, 1909 ప్రాంతాన్ని ఒక పదిమంది విద్యార్థుల ముండేవాళ్లం. మా పని రాజమండ్రి చుట్టూ పర్యటన చేయడమే ! జయిల్ రోడ్డమ్మటే సారంగధరుని మెట్ట యెక్కి అక్కడనుంచి ఏమన్నా కంభం చెరువు రోడ్డుకు దిగి యిండ్లకు వచ్చేసేవాళ్లము. లేదా కంభం చెరువు రోడ్డున వెళ్ళి ఆలారింగు రోడ్డమ్మట ఆర్యాపురంమీదుగా వచ్చేసే వాళ్లము. అప్పుడప్పుడు బొమ్మూరు మెట్టెక్కేవాళ్లం. ధవిళేశ్వర తీర్థానికి వెళ్లేటప్పుడు డరోథీ స్టీమరో హెలెను స్టీమరో ఎక్కి వచ్చేటప్పుడు సంజవెన్నెల్లో నడిచేసి వచ్చేసే

వాళ్ళము. నడక అంటే బహు సరదాగా వుండేది. నావ ఎక్కడం అంటే ఇప్పట్లాగా లాంచీ ఎక్కేవాళ్ళం కాదు నావ అద్దెకు తీసుకొని దాన్ని మేమే నడిపి తెడ్లువేసుకొంటూ పోయేవాళ్ళం పాడుకొంటూ ఏ లంకమీదకో ? అక్కడదిగి తెచ్చుకొన్న పులిహోరో, బొబ్బట్లో తినేసి ఇన్ని నీళ్ల తాగేసేవాళ్ళం. ఆ రోజుల్లో కాఫీలు లేవు. తేనీళ్ళూ లేవూ.

ఈ షికార్లు వెళ్ళడం, తరువాత తరువాత నర్సాపురం వెళ్ళాకకూడా అలవాటు అయిపోయింది. ఒక్కొక్క షికారు రాకపోక కలిపి ఆరుమైళ్ళకు తక్కు వుండేది కాదు. అప్పుడప్పుడు లిఖితపూడి, సీతారాంపురం వంతెన అదీ దాటి వెళ్ళినప్పుడు రాకపోకల పొడవు 8 మైళ్లుకూడా వుండేది. మరి నర్సాపురపు గోదావరి మీద పడవవేసుకు వెళ్ళేవాళ్ళం. బహు ఆందంగా వుండేది. తిరుగ రాజమహేంద్రవరం వచ్చాక కూడా చాలా కాలం ఈ షికార్లు మానలే ! వెడుతునే వుండేవాళ్ళం. మావూరు అనగా శ్రీరంగపట్నం వెళ్ళినప్పుడు కొండ లెక్కడం పరిపాటే !

ఏవం విధంగా షికారు వెళ్ళడం అంటే ఒక ఆనందం నాకు. అది వ్యాయామం చేకూరుస్తుంది. ఉత్సాహానికి ఉత్సాహం పెంపొందిస్తుంది.

.... .... .... .... ....

## మాన్ సూన్ స్పీడ్

**"వుంతలో ముసిలమ్మ"** అంటే సర్వసాధారణంగా అందరికీ అర్థమైపోతుంది మైలురాయి అని. "మాన్‌సూన్‌స్పీడ్" అంటే